ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## నవమాధ్యాయము

సాలంకాయన మహర్షిచే సదాచార మహిమను గూర్చి వినిన మణిగుప్తాదులు ఓ గురువార్యా! యే విధమైన ఆచారము వలన దేవి సంతుష్టి చెంది తన్ను సేవించు పరమభక్తులను బ్రోచునో, యే సదాచార మహిను గూర్చి తమరు చెప్పితిరో అట్టి సదాచారమును గూర్చి సవివరముగ వినదలచుచున్నాము. మరియు ఏ గాయత్రీ మంత్ర మహిమ వర్ణనాతీతమని తమరు తెలిపితిరో అట్టి గాయత్రీమంత్రమును గురించి విశదముగా మాకు తెలియజేసి మమ్ములను ధన్యుల గావింపుడని ప్రార్థించిరి. మణిగుప్తాదుల ప్రార్థనను మన్నించి సాలంకాయన మహర్షి ఈవిధముగ చెప్పసాగెను.

### సదాచారవిధియొక్క వివరణము :-

"ఓ వైశ్యోత్తములారా! మీ ధర్మజిజ్ఞాసనుగాంచి మిక్కిలి సంతసించితిని. పూర్వము నారదునకు శ్రీమన్నారాయణుడును, శౌనకాదులకు సూతమౌనియు చెప్పిన సదాచారవిధి విశేషములను మీకిపుడు నేను వివరించెదను. దీనిని గురించి బ్రహ్మాండపురాణమున వ్యాసమౌనీంద్రునిచేత మిక్కిలి విపులముగ చెప్పబడినది. నేనా విషయములను అత్యంత సంక్షిప్తముగ మీకు తెలియజేసెదను, శ్రద్ధాళువులై ఆలకింపుడు.

సదాచారము లౌకికము, శాస్త్రీయము అను రెండు విధములుగ నుండును. తన మేలుకోరు నరుడు యీ రెండింటిని ఆచరించవలయును, ధీమంతులు గ్రామధర్మము, వర్ణధర్మము, సమాజధర్మము, దేశధర్మము అను వాటిని ఆచరింపవలయును. వేదోక్తమైన దేశధర్మమని తెలియవలయను. ద్విజుడైనవాడు వేకువజామున మేలుకొని,

ప్రతినిత్యము జరుపవలసిన అవశ్యకర్తవ్యములను మహర్షులు చెప్పిన చొప్పున మీకు తెలుపుచున్నాను. నరుడు ప్రాతఃకాలమున మేల్కొనవలెను, ఆ వెంటనే మంగళకరమైన ఒక వస్తువును దర్శించవలెను. దీపము, సువర్ణము, ఖడ్గము, సముద్రము, పచ్చని పంటపొలము, మేఘావృతమైన పర్వతము, దూడతోకూడిన ఆవు, ధర్మపత్ని లేక తనకు మిక్కిలి ప్రియమైన వ్యక్తి, తనకుడిచేతి అరచేయి మొదలైనవి మంగళకర వస్తువులని పెద్దలు చెప్పిరి. ప్రభాతవేళ స్వీయకర దర్శనము అత్యంత సులభసాధ్యము.

**"కరాగ్రే వసతే లక్ష్మీ కరమధ్యే సరస్వతి ।**
**కరమూలేతు శ్రీ కన్యా ప్రభాతే కరదర్శనమ్" ॥**
**"సముద్రవసనేదేవి పర్వతస్తన మండలే ।**
**విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే" ॥**

అనిపలికి భూదేవికి నమస్కరించి పడకపైనుండి భూమిమీద కాలుమోప వలెను. అనంతరము దేశకాల పాత్రాదులనెరిగి శౌచక్రియను నిర్వర్తించవలయును. ఆ పైన ఆచమించి ముఖ ప్రక్షాళనము చేసికొనవలెను. తరువాత దేహశుద్ధికొరకు స్నానము చేయవలెను. స్నానము చేయునపుడు "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదేసింధూకావేరి జలేస్మిన్ సన్నిధింకురు" అని పలికి సమస్త పుణ్యనదీజలములను తాను స్నానము చేయు జలములందు వసింపుడని ప్రార్థించవలెను. స్నానము వలన శరీర శుద్ధియేగాక మన మలిన కర్మల పాపములు కూడ తొలగిపోగలవు. స్నానాంతరము శుద్ధ వస్త్రములను ధరించి దేవఋషి పితృప్రీతిగ అర్ఘ్యప్రదానములాచరించవలెను. అటుపై యథావిధిగ విభూతి, కుంకుమ, తిలకాదులను, రుద్రాక్షమాలాదులను ధరించవలెను.

రుద్రాక్షలు రుద్రుని నేత్రముల నుండి ప్రభవించినవని పెద్దలందురు రుద్రాక్షధారణము శివజ్ఞానమునకు పరమసాధనము. అన్ని ఆశ్రమములవారును, అన్ని వర్ణములవారును రుద్రాక్షలు ధరించవచ్చును.

సదాచారపరులు తమ యిచ్చానుసారము తులసీమాలలను, స్ఫటికహారములను కూడ ధరించవచ్చును. తులసీధారణము వలన శాంతగుణము, సాధుత్వము పెరుగగలవు. స్ఫటిక ధారణము వలన కార్యదీక్ష, ధృఢత్వము వృద్ధి పొందగలరు. రుద్రాక్ష తులసి స్ఫటికముల వలన పవిత్రత, నిర్మలత్వము, ఆధ్యాత్మిక జ్ఞానాభివృద్ధి కలుగుటయేకాక అనేక శారీరక వ్యాధులు ఉపశమించును. నాయనలారా! పద్మపురాణములోని ఉత్తరకాండమున తులసీ మహత్వము సవివరముగ తెలుపబడియున్నది.

ఇప్పుడు పుణ్యప్రదమైన సంధ్యోపాసనను గురించి వినుడు, ప్రభాత సమయమున ప్రాతః సంధ్యను, సూర్యుడు నడినెత్తిపై నుండగ మధ్యాహ్న సంధ్యను, ఇనుడు అస్తమించక ముందే సాయంసంధ్యను నరుడుపాసించవలెను. సంధ్యోపాసనలో గాయత్రిని ఉపాసించుట మిక్కిలి ముఖ్యము. గాయత్రి సమర్చనము సర్వవేదసారభూతమైనది. గాయత్రి శ్రీ కన్యకాదేవికి అపరరూపమే యని తెలియనగును. సంధ్యోపాసనాంగముగ నుదుట వారి వారి సాంప్రదాయముల ననుసరించి తిలకధారణ చేయుట ఉత్తమ కర్తవ్యము. నుదుట ధరించు విభూతియొక్క గొప్పతనము విశిష్టమైనది. విభూతియనగ ఐశ్వర్యము. బ్రహ్మను భాసింపజేయునది గనుక భసితమనియు, పాపములను భస్మము చేయునది గనుక భస్మమనియు, అణిమాది విభూతులను కలిగించునది గనుక, విభూతియనియు, రక్షణ నొసగునది కనుక రక్షకియనియు ఈ విభూతి భస్మము పిలువబడుచున్నది.

నుదుట ఊర్ధ్వపుండ్రములను ధరించువారు వెలుగుతున్న దీపశిఖవలెగాని, వెదురాకువలెగాని, తమ్మిమొగ్గవలెగాని, త్రిశూలమువలెగాని, గుండ్రముగగాని, చతురస్రముగగాని వారి వారి సాంప్రదాయములను బట్టి వీనిని ధరింతురు.

అటుగాక నుదుట కుంకుమతిలకధారణము చేయువారు రెండు కన్నుల చివరలవరకు విభూతిని ధరించి, త్రికూటము లేక అమృతప్రదేశము అనబడు భృకుటీమధ్యమున చందనముతో కూడిన కుంకుమను చంద్రబింబాకృతితో తిలకముగ ధరించవలెను. శ్రీ దేవియైన పరాంబిక యిట్టి తిలకధారణము చేయువారి

యోగక్షేమములను వహించి, వారికి కైవల్యమును ప్రసాదించుననియు, లలాటమున కుంకుమను ధరించుట శ్రీ కన్యకాదేవికి ప్రీతికరమనియు పెద్దలు విశదపరచిరి. త్రిపుండ్ర ఊర్ధ్వపుండ్ర కుంకుమ తిలకాదులను వారివారి సంప్రదాయముల ననుసరించి సదాచారులు ధరించుచుందురు. ఈవిధముగ బొట్టులను పెట్టుకొనుటను శిరోవ్రతమని యందురు. అధర్వశీర్షోపనిషత్తునందు యీ శిరోవ్రతము గూర్చి విపులముగ చెప్పబడినది. శిరోవ్రతము యతులకు జ్ఞానమును, వానప్రస్థులకు వైరాగ్యమును గృహస్థులకు ధర్మమార్గమును, బ్రహ్మచారులకు స్వాధ్యాయమును ప్రసాదించును. దేవతలు గూడ రక్షణకు - భద్రతకు - పవిత్రతకు తిలక ధారణ చేయుదురని శాస్త్రములు తెలియజేసినవి.

ఇట్లు తిలకధారణ చేసిన తరువాత ఒక పవిత్ర స్థలములో సుఖాసనముపై కూర్చొని ఉత్తమమైన ఆచమనక్రియతో సంధ్యావందనమునకు ఉపక్రమించ వలయును.

ఆచమనక్రియ వైదికము, శ్రౌతము, శుద్ధము, పౌరాణికము, స్మార్తము, తాంత్రికము అను ఆరు విధములుగ చేయబడుచుండును. తమ తమ సాంప్రదాయ సందర్భములననుసరించి ఆచమనమాచరించవలయును.

అటుపై ఓంకారమును తనహృదయమందు స్మరించుచు త్రిపాదగాయత్రిని జపించుచు ప్రాణాయామమాచరించవలయును. పూరక - కుంభక - రేచకములను క్రియలతో కూడియుండు ప్రాణాయామ ప్రక్రియను గురువు నుండి దెలసికొని అభ్యసించి ఆచరించవలెను.

ప్రాణాయామము ప్రణవాత్మకము. పరమాత్మ ప్రణవస్వరూపుడు కనుక ప్రాణాయామము పరమాత్మ స్వరూపమే యగునని పెద్దలు చెప్పుదురు. ఇది ప్రాణశక్తిని వృద్ధి పరచును.

**అటుపై "గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః।**
**గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః ॥**

అను గురుమంత్రముతో గురుధ్యానము గావించవలెను. తదుపరి కాలసంకీర్తనరూపమైన సంకల్పము చెప్పికొని మార్జన మాచరించి జలప్రాశనముగావించవలెను. లోపలి దోషములను, పాపములను హరింప జేయుటకై పునఃమార్జనమాచరింవలయును.

అనంతరము బొటన చూపుడు వ్రేళ్లు మడిచి నీటిని గాయత్రితో అభిమంత్రించి సూర్యదేవునకు మూడుమార్లు అర్ఘ్యమీయవలెను. తదుపరి "అసావాదిత్యోబ్రహ్మ" అని జలమును ప్రదక్షిణించవలెను.

మధ్యాహ్నమందున ఒకేమారు అర్ఘ్యమీయవలెను. త్రిసంధ్యలయందు మూడుమార్లు అర్ఘ్యమీయవలెను. గాయత్రీదేవిని ఆవాహనము చేసి హృదయములో ధ్యానించి పిదప యథాశక్తి మంత్రజపము చేయవలయును. అంగకరన్యాసములు చేసినను చేయకున్నను కృపణత్వములేని మంచి మనస్సుతో సచ్చిదానంద స్వరూపిణియైన గాయత్రీదేవిని ధ్యానించి జపించువారు అనంతఫలమును పొందుదురు. "ఓం భూర్భువస్సువః తత్స వితుర్వరేణ్యం భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్" అను యీ మంత్రము గాయత్రి మంత్రము. ఇది ఉపనయనకాలమున గురువులచేత ఉపదేశించబడుట వలన గురు మంత్రమనియు, బ్రహ్మోపదేశము అనియు పలుకబడుచున్నది. ఇదే త్రిపాద గాయత్రి (బ్రహ్మగాయత్రి) ఇదే జపగాయత్రిగ ప్రసిద్ధి చెందినది. దీనిని కర్మగాయత్రి, ప్రకటగాయత్రి అని కూడా పెద్దలందురు. దీనిలో సమస్త యోగరహస్యములు, వేదవేదాంత రహస్యములు యిమిడియున్నవి., మానవుడు తురీయాశ్రమములో ప్రవేశించినపుడు యీ గాయత్రి మంత్రము యొక్క నాల్గవ పాదమును కలిపి జపించ వలసి యుండును. ఆ చతుష్పాద గాయత్రిని పూర్ణగాయత్రి అని తెలియనగును. దీనిని సన్యాసులు మాత్రమే జపించుటకు అర్హులు. దీనినే గుప్తగాయత్రి అని అందురు. ఈ గుప్తగాయత్రీ వివరణము పంచదశి, వరివస్యా రహస్యములలో నున్నది. గాయత్రీ మంత్ర జపము ఇహపర సౌఖ్యదాయకము.

గాయత్రియే ఆదికన్యయైన యోగమాయాస్వరూపిణి. ఈ శక్తియే కలియుగమున సత్యాహింసలతో, శాంతిత్యాగకారుణ్యములతో వినూత్న విధానమున లోకములో

ధర్మప్రతిష్ఠాపన చేయుటకై శ్రీ కుసుమశ్రేష్ఠి యింట శ్రీ వాసవీ కన్యకానామముతో అవతరించినది.

"ఆది శక్త్యైచ విద్మహే వాసవీ దేవి ధీమహి
తన్నో కన్యా ప్రచోదయాత్ ॥"

అను శ్రీ వాసవీగాయత్రిని జపించు వారికి కూడా పైన నుడివిన సమస్త ఫలములు లభించగలవు. సంధ్యావందన మందు గాయత్రీ జపమును ఆచరించిన తదుపరి గాయత్రీ తర్పణమాచరించవలయును. పిదప భూమికి నమస్కారము చేయవలయును. ద్విజులు తమగోత్ర ఋషినామములు గల ప్రవర చెప్పి నమస్కరించవలయును. ఈ విధముగ ప్రాతః కాలమందలి సంధ్యావందనము విధించబడినది.

సంధ్యావందనము ముగిసిన పిమ్మట అగ్నికార్యమాచరించవలయును. అటుపిమ్మట సావధాన చిత్తముతో పంచాయతనపూజ సలువవలయును. మధ్యన శ్రీ కన్యాకాపరమేశ్వరిని, ఈశాన్యమున విష్ణువును, ఆగ్నేయమున శివుని, నైరుతిలో గణపతిని, వాయువ్యమున సూర్యుని వుంచి అర్చింపవలయును.

ఓ వత్సలారా! ఉదయకాలమందువలె మధ్యాహ్న, సాయంకాలముల యందు కూడా విధ్యుక్తముగా సంధ్యావందనము మాత్రము చేయవలెను.

గృహస్తులకు బ్రహ్మయజ్ఞము - దేవయజ్ఞము - పితృయజ్ఞము - మనుష్యయజ్ఞము (అతిథి యజ్ఞము) - భూత యజ్ఞము అను పంచ యజ్ఞములు విధింపబడియున్నవి. బ్రహ్మనిష్ఠ, బ్రహ్మోపాసన, బ్రహ్మతత్వ విచారణ, ప్రణవ ధ్యానము, ఉపనిషత్పారాయణ, గీతాపారాయణ మున్నగునవి బ్రహ్మయజ్ఞమనబడును.

ప్రాతఃసాయంకాలములలో అగ్నికార్యము చేసి ఇంద్రియములకు, ఇంద్రియాది దేవతలకు హవిర్భాగము ఒసగుట దేవయజ్ఞమనబడును. ప్రతి గృహమునందు చేయబడు యీ యజ్ఞముల ధూపము వలన దేహబలము, బుద్ధిబలము పెంపొందును.

వాతావరణ కాలుష్యము అంతరించును. అమృతోపమానమైన జలముతో సకాల వర్షములు కురియును. వాయువు పరిశుద్ధమై జీవులకు ఆరోగ్యము కలుగును. దైవకృప కలుగును. ఇట్లు సమస్త శ్రేయములు ప్రాప్తించును.

మనకు దేహజన్మమును ప్రసాదించు తల్లిదండ్రులకు జ్ఞానజన్మమును ప్రసాదించు గురువును మరియు పితృసమానులైన తదితర పెద్దలను సేవించుట, పోషించుట అనునవి పితృయజ్ఞములనబడును.

మన ఇండ్లకు వచ్చు లోకోపకార పరాయణులగు పెద్దలు, విద్వాంసులు, స్వాములు, మిత్రులు మొదలగు సజ్జనులకు అతిథ్యమిచ్చి సత్కరించుట అతిథి యజ్ఞమనబడును. సమాజ సౌభాగ్యమునకు ఉపయోగపడు గోవులు, గుఱ్ఱములు, కుక్కలు, గొర్రెలు, మేకలాదిగగల జంతువులను కోళ్లు, కాకులు, పావురములు, చిలుకలు మొదలగు పక్షులవంటి జీవులను పోషించుట భూతయజ్ఞమనబడును. వాటిని ఆచరించవలెను.

ప్రతిదినము గృహస్తులు చేయు పనిపాటల వలన క్రిమికీటకములు చచ్చుచుండును. ఇట్టి చర్యల వలన ప్రాప్తించు పాపములను వారు నశింపజేసి కొనవలెను. కూరలు - దుంపలు - పత్రములు - ఫలములు మొదలైన పదార్థములను అగ్నిలో వేల్చి దేవతలకు సమర్పించిన తరువాతనే భుజించవలయును. అగ్ని కార్యములు చేయనివారు తాము చేయు నిత్యపూజయందు ఆహారపదార్థములను దేవతలకు నైవేద్యముగ సమర్పించి అటుపై మాత్రమే తాము ఆహారమును స్వీకరించవలెను. తల్లి - దండ్రి - గురువు - సోదరులు - దాసులు - ఆశ్రితులు - అతిథి - అభ్యాగతుడు - అగ్ని వీరందరును గృహస్తుడగు యజమాని చేత చక్కగ పూజింపబడదగినవారు, పోషింపబడదగినవారు.

పాపరహితులారా! ప్రతివాడును ఋణత్రయవిముక్తుడుగావలయును. ప్రతివానికి దేవఋణము - ఋషి ఋణము - పితృ ఋణమని మూడు ఋణములుండును. మానవుడు బ్రహ్మచర్యము వలన ఋషిఋణము నుండియు,

తర్పణము వలన పిత్రుఋణము నుండియు, యజ్ఞము వలన దేవఋణము నుండియు విముక్తుడు కాగలడు.

ఇట్లు సాలంకాయనుని వలన సదాచార విధానమును మరియు గాయత్రీ మంత్ర మహత్వమును వినిన మణిగుప్తాదులు సంతుష్టులై శ్రీ వాసవీ విరూపాక్షుల తదుపరి గాథను తెలియగోరి ఆ ముని వరునితో, "ఓ గురుదేవా! ఉపనయన వేదారంభ సంస్కారములను పొందిన వాసవీ విరూపాక్షుల విద్యాభ్యాసము ఎట్లు సాగినది? అటుపై ఏమైనది? ఆ ఉదంతములను మాకు దయతో తెలియజేయుడు" అని ప్రార్థించిరి. అంత సాలంకాయన మహర్షి వారికీ విధముగ చెప్పసాగెను.

ఆది భాస్కర సద్గురుడు వాసవీ విరూపాక్షుల యొక్క ఉపనయనము, వేదారంభము అను సంస్కారములను గావించి సంతుష్టుడై అనంతరము వారిచే చతుర్వేదములను సమస్త శాస్త్రములను, కళలను అభ్యసింపజేసెను. వాసవీ విరూపాక్షులు గురువును నిమిత్తమాత్రునిగ జేసికొని అతిశీఘ్రముగ వేదవేదాంగములను షట్చాస్త్రములను చతుష్షష్ఠికళలను పేరుగల అరువది నాలుగు విద్యలను తామే అభ్యసించిరి. క్రమముగ వారిరువురును యౌవన సంపదను పొందిరి.

గమనిక :-

1. సంధ్యావందన విధానమును సవివరముగ తెలియగోరువారు నాచే మంత్రార్థక్రియా వివరణములతో రచింపబడిన "సంధ్యావందనము" అను చిన్న పుస్తకమును చదువవలసినదిగా మనవి.

2. అత్యంత గుహ్యము అనంత మహిమాన్వితమునైన గాయత్రీ మంత్ర మహత్వమును తెలుసుకొన గోరువారు నాచే రచింపబడిన "గాయత్రీ విజ్ఞానసారము" అను చిన్న పుస్తకమును చదువలసినదిగా మనవి.